జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
ఆదివారం, మే 17, 2026








## మద్దూరు వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



3 లో

# సామాన్యుడిపై ధరాఘాతం






పశ్చిమాసియా దేశాల మధ్య యుద్ధం ప్రభావం పేద, మధ్యతరగతి కుటుంబాలను వెంటాడుతూనే ఉన్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సతమతమవుతున్న కుటుంబాలకు పెట్రోల్, డీజిల్ మంట అంటుకుంది. యుద్ధ ప్రభావంతో గ్యాస్ భారం మోస్తున్న సామాన్యుల బతుకు బండిపై కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు మరింత భారాన్ని పెంచింది. కేంద్ర ప్రభుత్వం ముందస్తుగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని సంకేతాలు ఇస్తున్నట్లుగానే పెట్రోల్ లీటరుకు రూ 3.39, డీజిల్‌పై రూ 3.27 పెంచింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసే వరకు ఆగిన పెట్రోల్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 78 వరకు వివిధ చమురు కంపెనీలకు సంబంధించిన పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటి ద్వారా జరిగే పెట్రోల్ డీజిల్ విక్రయాలపై తాజాగా పెరిగిన చమురు వారం ప్రతినెల దాదాపు రూ 5 కోట్ల వరకు వాహనదారులు భరించాల్సి ఉంటుంది.

### మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడం

## మనందరి బాధ్యత

-దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించుకోవాలి

-మానవ అక్రమ రవాణా బాధితుల పట్ల సమాజం చూపే వివక్ష మారాలి

-సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్



### అభివృద్ధి నిర్మాణ పనులలో

## వేగం పెంచాలి

**జూన్ 2 న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి.**

**జిల్లా కలెక్టర్**

**సీ హెచ్ ప్రియాంక.**



నారాయణపేట ప్రతినిధి మే 16 ప్రజా జ్యోతి నారాయణ పేట జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నిర్మాణాలను వేగంగా చేయించి జూన్ 2 ( రాష్ట్ర అవతరణ దినం) వ రోజున ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు

# సామాన్యుడిపై ధరాఘాతం..

పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి చిన్న పనికి సామాన్య కుటుంబాల వరకు వాహనాలను వినియోగిస్తున్నారు. చిన్న, పెద్ద దానికి అనే తేడా లేకుండా ఎక్కడికి వెళ్లాలన్నా వాహనాలు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పెట్రోల్ లీటర్ ధర రూ.111.43 డీజిల్ ధర రూ 99.50కి పెరిగింది. దీంతో సామాన్యుడు జేబుకు ఉన్నఫలంగా చిల్లులు పడే పరిస్థితి ఏర్పడింది.

పేదోళ్లకు నిత్యావసరాలు భారమే..

యుద్ధం ప్రభావం అనేక రంగాలపై ప్రభావం చూపుతూ నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్కువగా నేత కార్మికులు, వ్యవసాయ కూలీలు, దినసరి కూలీలు ఉన్నారు. వీరికి కొద్దిపాటిగా ధరలు పెరిగితేనే కష్టంగా మారుతుంది. ఇప్పటికే ఉప్పు, పప్పులు, నూనెలు, రోజూ వాడే వంట సామగ్రి ధరలు పెరిగాయి నూనెల ధర ఏకంగా రూ.190 వరకు పెరిగింది. మిగతా నిత్యావసర సరుకులు ధరలు కూడా బిల్లింగ్ వైపు చూస్తేనే సామాన్యులు భయపడే పరిస్థితి కనిపిస్తోంది. ఈక్రమంలోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా రంగంపై భారీగా ప్రభావం చూపుతోంది. రవాణా చార్జీలు పెంచడం ద్వారా నిత్యావసర సరుకులు కూడా పెరగనున్నాయి. కూరగాయలతో పాటు మాంసం, పండ్లు ఒక్కటేమిటి అన్ని నిత్యావసరాల ధరలు పెరగడం ఖాయమనే వాదనలు వినిపిస్తున్నాయి. యుద్ధంతో ఇతర దేశాల నుంచి వచ్చే దిగుమతులు చార్జీలు, సుంకాలు పెరిగాయి. వీటి ప్రభావంతో కూడా ధరలు పెరిగాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు మరింత భారాన్ని పెంచుతోందని ఆందోళన వ్యక్తం అవుతోంది.

ప్రైవేట్ ప్రయాణ చార్జీలకు రెక్కలు..

రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి హైదరాబాద్, బెంగళూరు, ముంబాయి, చెన్నై.. ఇలా వివిధ ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగాలు, మరోవైపు సిరిసిల్ల కేంద్రంలోని వస్త్ర వ్యాపారులు వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభుత్వ రంగం, ప్రైవేట్ రంగ రవాణా వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతుంది. ప్రధానంగా ప్రైవేట్ రవాణా వ్యవస్థలను జిల్లా ప్రజలు ఎక్కువగా ఉపయోగిస్తారు. చమురు ధరల పెరుగుదలతో రవాణా చార్జీలకు రెక్కలు వస్తున్నాయి. ట్రాన్స్‌పోర్ట్ వాహనదారులు కూడా ధరలు పెంచేస్తున్నారు. ఇంధనంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న రంగాలపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది.

రైతులపై మరింత భారం

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంపైనే ఆధారపడి అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదల రైతులపై భారాన్ని మోపనుంది. రైతులు దుక్కులు దున్నడం, పొలం పనులకు వాహనాలను ఉపయోగిస్తున్నారు. స్ప్రేయింగ్, కలుపుతీత, కోతలు కోయడం వంటి పనులే కాకుండా ధాన్యాన్ని తరలించే వరకు వాహనాలను వినియోగిస్తున్నారు. డీజిల్ ధర పెరగడంతో రైతులకు ఎకరానికి అదనంగా మరో రూ.3 వేల వరకు అదనపు భారం పడనుంది. ఈ పరిస్థితుల్లో అన్ని వర్గాల ప్రజలు పెట్రోల్, డీజిల్ పెరుగుదలపై ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

### మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడం

# మనందరి బాధ్యత

నారాయణపేట ప్రతినిధి మే 16 ప్రజా జ్యోతి

నారాయణపేటలోని రెవిన్యూ డివిజనల్ ఆఫీస్ ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన గౌరవ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అధ్యక్షతన మానవ అక్రమ రవాణా'మరియు 'వాణిజ్య లైంగిక దోపిడీ' న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ మాట్లాడుతూ అమాయక మహిళలు మరియు పిల్లలు ఈ రక్కసి బారిన పడుతున్నారు. మెరుగైన భవిష్యత్తు, ఉద్యోగం లేదా మంచి జీవితాన్ని ఇస్తామంటూ మాయమాటలు చెప్పి, వారిని బలవంతంగా చీకటి ప్రపంచంలోకి లాగుతున్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో దీనిపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కలిగి ఉండాలి. రక్షించబడిన బాధితులకు వైద్య, మానసిక సాయం, మరియు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని సమాజంలో భాగస్వామ్యం చేయాలి. మానవ అక్రమ రవాణా ఇది ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేరపూరిత వ్యాపారం, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని, ప్రధానంగా మహిళలు మరియు పిల్లలను ప్రభావితం చేస్తుంది. అక్రమ రవాణాదారులు బాధితులను నియంత్రించడానికి తరచుగా హింస, బెదిరింపులు, రుణ బానిసత్వం మరియు గుర్తింపు పత్రాలను స్వాధీనం చేసుకోవడం వంటి పద్ధతులను ఉపయోగిస్తారు. ప్రాణాలతో బయటపడిన వారిని ఒక తీవ్రమైన నేరానికి బాధితులుగా చూడాలి, అంతేగాని నేరస్థులుగా కాదు. చట్ట అమలు మరియు సామాజిక స్పందనలు పునః బాధితులుగా మారడం, కళంకం మరియు శిక్షలను నివారించాలి. నిజమైన న్యాయానికి సమగ్ర పునరావాసం అవసరం. ఇందులో సురక్షితమైన గృహవసతి, వైద్య మరియు మానసిక ఆరోగ్య సంరక్షణ, న్యాయ సహాయం, మరియు పునః అక్రమ రవాణాను నివారించడానికి ఆచరణీయమైన జీవనోపాధి ప్రత్యామ్నాయాలు ఉంటాయి. యుక్తవయస్సు రాకముందే పెళ్లి చేయడం సరైన విద్య, నైపుణ్యాలు లేకపోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు కోల్పోయి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. బాల్య వివాహాల కి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి. బాల్యకార్మిక వ్యవస్థ ని రూపుమాపాలి. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మి గౌడ్ తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ఎల్ రమేష్ (ఆర్.డి.ఓ), శంకర్ నాయక్ (ప్రాజెక్ట్ డైరెక్టర్), తిరుపతయ్య (డి.సి.పి.యూ), క్రాంతి రేఖ ( సఖి సెంటర్ కో-ఆర్డినేటర్), నర్సిములు (డిస్ట్రిక్ట్ కో -ఆర్డినేటర్) ,డాక్టర్.జాం రాజ్ (ఎం.ఓ) ( యూపీహెచ్), ఏ. వెంకటేశ్వర్లు ( ఎస్.ఐ), అశోక్ కుమార్ (ఇ.వి.ఎ.ూ), విజయ కుమార్, నందు నామాజీ ( సీనియర్ అడ్వకేట్), క్రాంతి (పనెల్ అడ్వకేట్), పి.ఎల్.వి‌స్, ఆశ కార్యకర్తలు మరియు మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ జిల్లా మే 16నాగర్ కర్నూల్ జిల్లాలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు, డీఎంహెచ్ఓ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి ఆసుపత్రుల స్థితిగతులు ఆసుపత్రుల సేవలు స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, అత్యవసర సేవలు, ప్రసూతి సేవలు, ప్రయోగశాల పరీక్షలు, పారిశుధ్య పరిస్థితులు తదితర అంశాలపై కలెక్టర్ క్షుణ్ణంగా ఆరా తీశారు. ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే ఆరోగ్య సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.అలాగే ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చెప్పారు.

జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశించారు.

నాగర్ కర్నూలు జిల్లా మెడికల్ కళాశాల వసతులు వైద్య ఆరోగ్యశాఖలో నిర్మిస్తున్న భవనాల స్థితిగతులపై కలెక్టర్ ఆరా తీశారు.

ఈ సమావేశంలో జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, డిఎంహెచ్ఓ రవి నాయక్, వైద్య విధాన పరిషత్ వైద్యులు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

### అభివృద్ధి నిర్మాణ పనులలో

# వేగం పెంచాలి

అన్ని మండలాల లో వివిధ నిధులతో కొనసాగుతున్న పలు నిర్మాణ ( ఇంజనీరింగ్ వర్క్స్) పనుల పై శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఎస్. ఈ లు, ఈ ఈ లు, డీ ఈ లు, ఏ ఈ లతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు. ముందుగా జిల్లా కేంద్రానికి సంబంధించి మెడికల్ కళాశాల, ఎంసీహెచ్, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే మెడికల్ కళాశాల వద్ద ఒక్క బోరు కూడా పడలేదని, మరి నిర్మాణ పనులకు క్యూరింగ్ ఎలా చేస్తున్నారని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. మెడికల్ కళాశాల సమీపంలో ఒక రైతు పొలానికి చెందిన ప్రైవేటు బోరు నుంచి నీటిని క్యూరింగ్ కు వాడుకుంటున్నామని అధికారులు కలెక్టర్ కు జవాబు ఇచ్చారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు ఎక్కడ జరిగినా ముఖ్యంగా మెడికల్ కాలేజీ వద్ద తప్పకుండా వాన నీటి సంరక్షణ ( ఇంకుడు గుంతలు) చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో జనరేటర్ ఎంతో అవసరమని కానీ ఎందుకు వినియోగంలో లేదని ప్రశ్నించారు. జనరేటర్ ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో ఏ ఏ మండలాల్లో కస్తూర్బా గాంధీ పాఠశాలలో మర మ్మతు పనులు జరుగుతున్నాయని ఆరా తీశారు. వాటితో పాటు పీఎం శ్రీ స్కూల్స్ లలో సైన్స్ ల్యాబ్స్ నిర్మాణాలను పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. 2023-24, 2024-25 సంవత్సరం నాటి పనులన్నింటినీ పూర్తి చేయాలన్నారు. మక్తల్ లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అకాడమిక్ బ్లాక్ నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలపగా, పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. మక్తల్ లో జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణం, అలాగే మద్దూరు

ఎస్సీ బాలుర వసతి గృహ మరమ్మతు పనుల గురించి కలెక్టర్ ప్రస్తావించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఏమైనా మరమ్మతు పనులు ఉంటే వేసవి సెలవులు ముగిసే లోపు పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం పక్కన సమీకృత చేనేత భవన నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలపగా జూన్ 2 న ప్రారంభానికి సిద్ధంగా ఉందా అని అడిగి, అంతలోపు మిగతా పనులేమైనా ఉంటే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ఇక జిల్లా కేంద్రంలోని మూడు ఓవర్ హెడ్ 10 లక్షల లీటర్ల ట్యాంకుల నిర్మాణాలు ఆగస్టు వరకు పూర్తి చేయాలని ఆమె సూచించారు. మక్తల్ పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరా తో పాటు సంగం బండ రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా కు ప్రత్యామ్నాయ పథకాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈ ఈ లు శ్రీనివాస్ రావ్, రంగారావు తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. మన్యం కొండ నుంచి జిల్లాకు మిషన్ భగీరథ పథకం ద్వారా రోజుకు ఎన్ని లీటర్ల నీటి సరఫరా జరుగుతుందో తనకు జాబితా ఇవ్వాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మిషన్ భగీరథ పథకం ద్వారా మండలాల వారీగా ఏ ఏ పనులు జరుగుతున్నాయో ఏ ఈ లను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో ఆయా పనులను పూర్తి చేయాలన్నారు. వేసవి కాలం తర్వాత పనులు చేస్తే లాభం లేదన్నారు. జిల్లాలో ఆర్ అండ్ బీ పరిధిలో జరుగుతున్న రోడ్ల పనులు, కలెక్టరేట్ నూతన భవన నిర్మాణ పనుల గురించి ఆ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని కూడా జూన్ 2 లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని తెల్పి చెప్పారు. గుండుమాల్, కొత్తపల్లి మండలాల సమీకృత భవన సముదాయాల నిర్మాణ పనులు, కాద నిధులతో చేపట్టిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఇది తనకు తొలి సమావేశం అని, వచ్చే సమావేశానికి ఏ ఈ లు ఎన్ని పనులు పూర్తి చేశారో? ఎన్ని పర్యటనలు చేశారో నివేదికలతో రావాలని, ఇతర జిల్లాలకు ఇన్ ఛార్జ్ గా ఉన్నామని కారణాలు చెప్పవద్దని, ఈ జిల్లాలో ఖచ్చితంగా గురు,శుక్ర, శని వారాల్లో అందుబాటు లో ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి నిర్మాణ పనులు, శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలలో విధిగా ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో టీజీ ఎం ఐ డీ సి ఈ ఈ వేణు గోపాల్, పీ ఆర్ ఈ ఈ అశోక్, ఆర్ అండ్ బీ ఎస్. ఈ. వెంకట రమణ, ఆయా శాఖల డీ ఈ లు, ఏ ఈ లు పాల్గొన్నారు.



# మద్దూరు వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి మే16:**
నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను పరిశీలించిన కలెక్టర్, వాటిని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కేంద్ర నిర్వాహకులు కలెక్టర్‌కు వివరాలు తెలియజేస్తూ, దొడ్డు రకం వడ్లు ఎక్కువగా ఉండటంతో కోస్గి ధనలక్ష్మి రైస్ మిల్లు యజమాని మద్దూరు కేంద్రం నుంచి బస్తాలను పంపొద్దని చెప్పి, కేవలం కోస్గి మండలానికి చెందిన కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే బస్తాలను మాత్రమే మిల్లుకు తరలించుకుంటున్నారని తెలిపారు.దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారికి ఫోన్ చేసి మాట్లాడి, మద్దూరు కేంద్రానికి చెందిన ధాన్యం బస్తాలను కూడా మిల్లులో దించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇప్పటివరకు కేంద్రానికి సుమారు 16 వేల బస్తాలు విక్రయానికి వచ్చాయని, ఇంకా 5 నుంచి 7 వేల బస్తాలు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు.ఈ తనిఖీలో మద్దూరు తహసిల్దార్ మహేశ్, పుర కమిషనర్ శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం

## జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.

**నారాయణపేట ప్రతినిధి మే 16 ప్రజా జ్యోతి**
భవిష్యత్తు లో వచ్చే ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ ను సిద్ధం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. పర్యావరణ విపత్తులను ఎలా ఎదుర్కోవాలి? ఎలా సన్నద్ధం కావాలని శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని మక్తల్ నియోజక వర్గం కృష్ణానది లో ప్రవాహం పెరిగి వరదలు, వరద ఉధృతి వచ్చే ప్రమాదం ఉంటుందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తు లో ప్రమాదాలు సంభవిస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఆయా ప్రభుత్వ శాఖలు ఏ విధంగా స్పందించాలి?. తీసుకోవాల్సిన ముందస్తు కార్యాచరణ ఏమిటి అన్నదానిపై చర్చించారు. సమావేశంలో రూపొందించుకున్న కార్య చరణతో ఈ నెల 18 న ఉదయం 8 గంటల నుంచి జిల్లాలోని ఎంపిక చేసిన 7 ప్రాంతాల్లో మాక్ డ్రిల్ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మాక్ డ్రిల్ కు ఎలా సిద్ధం కావాలి, డ్రిల్ లో ఏం చేయాలి అనే విషయాలపై కలెక్టర్ అధికారులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. సోమవారం ఉదయం మాక్ డ్రిల్ చేసేందుకు జిల్లాలోని నదీ పరివాహక ప్రాంతమైన హిందూపూర్, వాసు నగర్ లో 5 ప్రాంతాలతో పాటు మక్తల్ నియోజక వర్గ కేంద్రంలోని ఎల్లమ్మ కుంట కాలనీ, మక్తల్ ఏరియా ఆసుపత్రి ని ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. అంతేకాకుండా జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్, మక్తల్ రిలీఫ్ క్యాంప్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.




అంతకు ముందు కలెక్టర్ కృష్ణా నదిలో ఎన్ని క్యూసెక్కుల నీళ్ళు వస్తే వరద ఉధృతి పెరుగుతుందని? వరద సమాచారం వచ్చిన వెంటనే తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 7లక్షల క్యూసెక్కుల నీళ్ళు ఎగువన ఉన్న నారాయణ పూర్ నుంచి వస్తే మూడు గంటలలోపు కృష్ణా నదికి వరద ఉధృతి పెరుగుతుందని, నదీ పరివాహక ప్రాంతాలు జల మయం అయ్యే ప్రమాదం ఉందని కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్. డీ. సీ రాజేందర్ గౌడ్, ఎఫ్ ఆర్ వో సురేష్ రెడ్డి, ఏవో శ్రీధర్, ఆర్టీవో మేఘా గాంధీ, సీపీఓ ఖాఘా వాహన్, పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, సీఐ శివ శంకర్, కలెక్టరేట్ అధికారిని కల్యాణి, సంబంధిత అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# బండి భగీరత్ ను వెంటనే అరెస్ట్ చేయాలి. కఠినంగా శిక్షించాలి

## -కుల నిర్మూలనా పోరాట సమితి (కే ఎన్ పిఎస్)

**నారాయణపేట ప్రతినిధి మే 16 ప్రజా జ్యోతి**

మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి లొంగదీసుకుని ఆమెపై అనుచిత విధానాలను కొనసాగించిన బండి భగీరత్ ను వెంటనే అరెస్ట్ చేయాలని కుల నిర్మూలనా పోరాట సమితి డిమాండ్ చేసింది. ముఖ్యంగా 2025 డిసెంబర్ 31వ తేదీ రాత్రి మొయినాబాద్ లో బాలికపై దాడి చేసి ఆమెకు ఇష్టం లేకున్నా బలవంతంగా మద్యం తాగించి ఆమెను శారీరకంగా అనుభవించిన భగీరథ పై ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడాన్ని కే ఎన్ పి ఎస్ తీవ్రంగా ఖండించింది వెంటనే భగీరత్నం అరెస్ట్ చేయాలని బాధితురాలికి న్యాయం చేయాలని బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కేసు నమోదయి వారం రోజులు అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం నిందితుని అరెస్టు చేయకపోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. భగీరథ కు రాజకీయ అండ ఉన్నందునని కేసును నత్తనడకన నడిపిస్తూ పరోక్షంగా పోలీసులు భగీరథకు సహకారం కొనసాగిస్తున్నారని వారు ఆరోపించారు. సామాన్యులకు ఒకరకంగా రాజకీయ అండ ఉన్న వారికి ఒక రకంగా వ్యవహరించడం సరైనది కాదని వారు తెలిపారు. కేంద్ర మంత్రి కొడికైనందున భగీరథ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నదని తెలపారు . భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో దళిత ప్రజా సంఘాల ఐక్యతతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల నిర్మూలనా పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



# 18న ప్రజావాణి రద్దు



**గద్వాల మే 16 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**
ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 18న రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అదే రోజు దిశా కమిటీ సమావేశం నిర్వహించడంతో పాటు, భారీ వరదలు,విపత్తు పరిస్థితుల్లో సంబంధిత శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం మొత్తం అక్కడే నిమగ్నమై ఉంటుందని పేర్కొన్నారు.ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.కాగా,ఈ నెల 25న ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# పాగుంట వెంకన్న స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం





**కే టి దొడ్డి మే 16(ప్రజా జ్యోతి):**
కే టి దొడ్డి మండలం వెంకటాపురంలో వెలసిన పాగుంట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.శనివారం అమవాస్య సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల భక్తులతో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్, కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా భక్తులు ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు.భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.అమావాస్య సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవాని నిర్వహిస్తున్నారు.అమావాస్య సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.ఎండలను దృష్టిలో పెట్టుకుని చలువ నీడలు ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు.

# ఐజలో ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటుకు భవనాల పరిశీలన

అయిజ మే 16(ప్రజా జ్యోతి):ప్రస్తుతం ఎర్రవల్లిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను ఐజ పట్టణంలోనే ఏర్పాటు చేయాలని ఐజ మండలానికి చెందిన యువత ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన నేపథ్యంలో అధికారులు చర్యలు ప్రారంభించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత,జోనల్ ఆఫీసర్ విద్యుల్లత,పాఠశాల ప్రిన్సిపాల్ రామాంజనేయులు,ఐజ పట్టణ యువకులు రాజు,మల్లికార్జున్,రఘుగౌడ్,మధు,ఏసన్న,లెనిన్,బాబుల ఆధ్వర్యంలో మూడు భవనాలను పరిశీలించారు.అన్ని సౌకర్యాలు కలిగిన ఒక భవనాన్ని జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు ఎంపిక చేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు నుషిత ఒక ప్రకటనలో తెలిపారు.భవనం ఎంపిక పూర్తయ్యాక ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను ఐజలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం



**నారాయణపేట ప్రతినిధి మే 16 ప్రజా జ్యోతి**
శనివారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీకాంత్ గారి ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణం నుండి అవగాహన ర్యాలీని జండా ఊపి ప్రారంభించడం జరిగింది ఇట్టి అవగాహన ర్యాలీ సావర్కర్ చౌరస్తాకు చేరుకొని అక్కడ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీకాంత్ గారు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ ఆడ దోమ వల్ల వ్యాపిస్తుందని ఈ వ్యాధి యొక్క ముఖ్య లక్షణం చలితో కూడిన జ్వరం ,ఒళ్ళు నొప్పులు, వాంతులు, విరేచనాలు శరీరంపై దద్దుర్లు ఉంటాయని తెలియజేశారు యూపీఎస్సీ వైద్యాధికారి డాక్టర్ జాత్రమాజ్ గారు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధికి నిర్ధారణ పరీక్షలకై డెంగ్యూ హారిడేటి కిడ్స్ మరియు ఈ ఎల్ ఐ ఎస్ ఏ పద్ధతులు ఉన్నాయని డాక్టర్ ద్వారా చికిత్స పొంది పూర్తిగా నయం చేసుకోవచ్చుని తెలిపారు . మన నారాయణపేట జిల్లా లో గత సంవత్సరములో 71 కేసులు మాత్రమే నమోదు అయ్యాయని ఈ సంవత్సరము ఇప్పటి వరకు 1 కేసు నమోదు అయ్యాయని గణాంకాలు తెలుపుతున్నాయని తెలిపారు అదేవిధంగా కోఆర్డినేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతు ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల ఉత్పత్తిని తొలగించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. అశోక్ కుమార్ కోఆర్డినేటర్ గారు జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం పై ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సూపర్వైజర్ సిబ్బంది తబితా రాణి, శంకర్ హెల్త్ అసిస్టెంట్స్ గోవిందరావు, బాల శేఖర్. ఏఎన్ఎం లు శివ శేషమ్మ, కరుణమ్మ, పుష్ప ,రామేశ్వరి, సరస్వతి, పుష్పలత ,మరియు యు పి హెచ్ సి ఆశా కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ. డిగ్రీ కాలేజ్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్య







**నారాయణపేట ప్రతినిధి మే 16 ప్రజా జ్యోతి**
కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలో మొత్తం 40 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. అందులో 04 మంది అభ్యర్థులు ఎంపిక కాగా, మిగిలిన అభ్యర్థులను తదుపరి నియామక ప్రక్రియ కోసం షార్ట్‌లిస్ట్ చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. మెర్సీ వసంత మేడమ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్లేస్‌మెంట్ సెల్ చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ప్లేస్‌మెంట్ సెల్ అధికారి షేక్ సుజాత్ అలీ సర్ ఆధ్వర్యంలో ఈ నియామక కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. కళాశాల అధ్యాపకులు మరియు ఇతర సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొని తమ సహకారాన్ని అందించారు.
ఎంపికైన అభ్యర్థులకు కళాశాల యాజమాన్యం మరియు సిబ్బంది అభినందనలు తెలియజేసి, వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.

## మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో ఘనంగా అమావాస్య వేడుకలు

**మల్దకల్ మే 16(ప్రజా జ్యోతి):**
ఆదిశిలా క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా శనివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.భక్తులు క్యూలైన్ విధానంలో స్వామివారి దర్శనం పొందారు.ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాదరావు,ఈవో సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయ సిబ్బంది,అర్చకులు ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించి భక్తులకు సేవలందించారు.దేవాలయానికి వచ్చిన భక్తుల కోసం స్థానిక అన్నదాన సత్రంలో గద్వాల కాకతీయ టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.అలాగే రాత్రి శాంతినగర్ శివశివాని టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో మరో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం,అనంతరం పల్లకి సేవ వైభవంగా నిర్వహించగా, రాత్రి భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.ప్రముఖ హరికథా భాగవతార్ హెచ్.ఎం.సుధాకర్ హరికథను వినిపిం చగా,హార్మోనియంపై ఆంజనేయులు,తమలపై బండలయ్య సహకారం అందించారు. వారికి స్వామివారి శేషవస్త్రం బహుకరించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో దేవాలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి.



## ఉద్యోగ మేళాతో ఉపాధి పొందిన నిరుద్యోగులు

**కల్వకుర్తి మే 16 (ప్రజా జ్యోతి):**
కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శర్వాణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉద్యోగమేళాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయన్నారు. హైదరాబాదులోని నిర్మాణ్ ఆర్గనైజేషన్, ముత్తూట్ ఫైనాన్స్, చోళ కంపెనీ, కేఎల్ గ్రూపు, ఫైస్టార్, ఫ్యాక్స్ కం, ట్రెండ్స్, జియో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 40 మందికి పైగా తుక్కుగూడ కల్వకుర్తి పరిసర ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఉద్యోగమేళా ద్వారా ఉపాధి అవకాశాలు పొందినందుకు నిరుద్యోగ అభ్యర్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అకాడమీ ఆర్గనైజర్ డా. రాజు, కృష్ణ ప్రసాద్, ఖాఖజ మెంటర్ రామకృష్ణ, అధ్యాపకులు అధ్యాపకేత్ర సిబ్బంది పాల్గొన్నారు.



## అత్యవసర సమయంలో మహిళకు రక్తదానం



**వనపర్తి, మే 16 (ప్రజాజ్యోతి):**
వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దావాజిపల్లె గ్రామానికి చెందిన గౌతమి అనే మహిళకు అత్యవసరంగా ఎ- నెగిటివ్ రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ గోబ్బుర్ స్పందించి రక్తదాతను సమీకరించారు. నాగవరం గ్రామానికి చెందిన పసుపుల మహేష్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జావీద్ హుసేన్ మాట్లాడుతూ, అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసిన మహేష్‌ను అభినందించారు. యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవీన్ గోబ్బుర్, డాక్టర్ జావీద్ హుసేన్, పసుపుల మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## టూరిజం వీక్ సెలబ్రేషన్స్ విజయవంతం చేయాలి




**గద్వాల మే 16(ప్రజా జ్యోతి):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఈనెల 18 నుంచి నిర్వహించే టూరిజం వీక్ సెలబ్రేషన్స్ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.టూరిజం వీక్ సెలబ్రేషన్స్ పై శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాద్ నుంచి సంబంధించిన శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్లో సమీక్షించారు.గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్ తో కలిసి టెలి కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెలబ్రేషన్స్ వారం రోజులపాటు షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు.అనంతరం కలెక్టర్ డివైఎస్ఓ కు పలు సూచనలు చేశారు.మే 22న జిల్లా స్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక షెడ్యూల్ కు సంబంధించి ఇప్పటివరకు జిల్లాలో నిర్వహించిన వివిధ శాఖల కార్యక్రమాలు,ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరిస్తూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు.క్రీడలకు సంబంధించిన కార్యక్రమాల్లో విద్యార్థులు,యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయాలన్నారు.

## నూతన ఎంపీడీవోకు ఆత్మీయ సన్మానం

**కల్వకుర్తి, మే 16 (ప్రజా జ్యోతి):**
కల్వకుర్తి నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన గాలి యాదయ్యను శనివారం జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ డైరెక్టర్ జిల్లెల్ల రాములు తన చాంబర్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలే ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన యాదయ్యను జిల్లెల్ల గ్రామం నుంచి ఆత్మీయ సన్మానం చేశారు. జిల్లెల్ల గ్రామ అభివృద్ధి కి తోడ్పాటుఅందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, రాజేశ్వరి రవి గౌడ్, ఉప సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు ఉన్నారు.



# యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తా

## టాస్క్- సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

### దుబాయ్‌లో ప్రముఖ గ్లోబల్ రిక్రూట్‌మెంట్ సంస్థ ప్రతినిధులను కలిసి కల్వకుర్తికి ఆహ్వానం




**కల్వకుర్తి, మే 16 (ప్రజా జ్యోతి):**
యువతకు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తాననిసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం
దుబాయ్‌లో ప్రముఖ అంతర్జాతీయ రిక్రూట్‌మెంట్ హ్యూమన్ రిసోర్స్ సంస్థ మీుఅంతీుు ఎబఎుఅ =వంశబతీఎవం జశీఅంబ్రీుఅఎ ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు,
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ఐటీ మరియు నాన్-ఐటీ రంగాల్లో నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఈ సంస్థ, దుబాయ్‌తో పాటు అమెరికా, యూరప్ దేశాల్లో కూడా తన సేవలను విజయవంతంగా విస్తరించిందని,ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, ఇంజినీరింగ్, టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, కార్పొరేట్ పలు ప్రొఫెషనల్ రంగాల్లో నిపుణుల నియామకంలో సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉంది అని తెలియజేస్తూ, కల్వకుర్తి ప్రాంత యువతలో ఉన్న ప్రతిభ, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలపై ఉన్న ఆసక్తి గురించి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సంస్థ ప్రతినిధులకు వివరించి, సరైన శిక్షణ, మార్గదర్శకం అవకాశాలు కల్పిస్తే గ్రామీణ ప్రాంత యువత కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని, రాబోయే కొన్ని నెలల్లో కల్వకుర్తి ప్రాంతాన్ని సందర్శించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక జాబ్ డ్రైవ్ నిర్వహించాలని సంస్థ ప్రతినిధులను సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆహ్వానించారు, ఆహ్వానానికి సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందిస్తూ.త్వరలో కల్వకుర్తి ప్రాంతంలో ఐటీ నాన్-ఐటీ రంగాలకు సంబంధించిన ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా సంస్థ ముందుకొచ్చినట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోప్రముఖ రిక్రూట్మెంట్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న పర్స్‌ను యజమానికి అప్పగించిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్




**మహబూబ్‌నగర్, మే 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మహబూబ్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్ తన నిజాయితీతో పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంచారు. విధుల నిమిత్తం మహబూబ్‌నగర్‌లో ఉన్న సమయంలో ఆయనకు ఒక పర్స్ దొరికింది. ఆ పర్స్‌ను పరిశీలించగా అందులో క్రెడిట్ కార్డులు, ఏటీఎం కార్డులు, నగదు తదితర ముఖ్యమైన పత్రాలు ఉన్నట్లు గుర్తించారు. పర్స్‌లోని క్రెడిట్ కార్డు వివరాల ఆధారంగా యజమాని నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బాలరాజు అని గుర్తించారు. అనంతరం ధన్వాడ పోలీస్ స్టేషన్ ద్వారా బాలరాజుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి అతనికి సమాచారం అందించారు. శ్రవణ్ కుమార్ సూచన మేరకు బాలరాజు మహబూబ్‌నగర్‌కు చేరుకోగా, పర్స్‌లోని నగదు, కార్డులు మరియు ఇతర వస్తువులను యథావిధిగా తిరిగి అప్పగించారు. పోగొట్టుకున్న పర్స్ తిరిగి దొరకడంతో బాలరాజు ఆనందం వ్యక్తం చేస్తూ కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్ నిజాయితీని అభినందించారు.
ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పీ దరావత్ జానకి కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆస్తులను తమ సొంత ఆస్తుల్లా భావించి బాధ్యతాయుతంగా వ్యవహరించడం పోలీసు శాఖకు గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి నిజాయితీతో కూడిన సేవా భావం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఘటన పోలీసుల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేదిగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజలకు సేవ చేయడమే కాకుండా వారి ఆస్తులను సురక్షితంగా కాపాడేందుకు పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని అధికారులు తెలిపారు.

# వార్డుల అభివృద్ధికి కృషి చేస్తా

## మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల

### 15 వార్డు లో సీసీ రోడ్ పనులు ప్రారంభం

కల్వకుర్తి, మే 16 (ప్రజా జ్యోతి):
వార్డుల అభివృద్ధి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. శనివారంకల్వకుర్తి మున్సిపాలిటీలోని 15వ వార్డులో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైనా సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల15కౌన్సిలర్ కుడుముల అష్మితా చంద్రకాంత్ రెడ్డిల తో కలసిప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాన్వాస్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీముల్ల శ్రీకాంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్ లు రాజేష్ కుమార్, గణేష్ యాదవ్, రమాకాంత్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఖలీల్, నాయకులు ఖుద్దుస్, జమ్ముల శ్రీకాంత్, శ్రీకాంత్, శివ కుమార్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షానికి తడిసిన ధాన్యం.. ఆందోళనలో రైతులు



**మహమ్మదాబాద్, మే 16 ( ప్రజా జ్యోతి )**
అకాల వర్షం కారణంగా మహమ్మదాబాద్ మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వరి ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన రక్షణ చర్యలు లేకపోవడం వల్ల తమ ధాన్యం నీటిపాలైందని రైతులు వాపోయారు.కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమయానికి ధాన్యం కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు, లారీలను తక్షణమే అందుబాటులో ఉంచాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.
అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో సరైన రక్షణ చర్యలు చేపట్టాలని, రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాలలో విద్యా వారోత్సవాలు ప్రారంభం



**మహమ్మదాబాద్, మే 14 ( ప్రజా జ్యోతి )**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల ఉన్నత పాఠశాలలో "ఎడ్యుకేషన్ వీక్--2026" జయశంకర్ బడి బాట కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎస్. గాయత్రి దేవి మాట్లాడుతూ, జయశంకర్ బడి బాట కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచడమేనని తెలిపారు.
ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, స్థానిక నాయకులు మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఉపాధిహామీ ఇందిరమ్మ ఇళ్లపై ఎంపీడీవో సమీక్ష

**కల్వకుర్తి మే 16 (ప్రజా జ్యోతి)**
ఉపాధి హామీ ఇందిరమ్మ ఇండ్లపై ఎంపీడీవో గాలి యాదయ్య మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్ ఎన్ ఎం ఎస్ యాప్ లో హాజరు నమోదు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి జూన్2నగృహప్రవేశాలు నిర్వహించాలి ఘణ వ్యర్థాల నిర్వాహణ నియమాలు బ్యాంకు ద్వారా పెన్షన్స్ చెల్లిస్తున్న వారి అంతెంటిఫికేషన్ సర్వే నర్సరీ మొక్కల షిఫ్టింగ్ గ్రేడింగ్గను వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల రూపకల్పనపై దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.



# తల్లిదండ్రుల స్మృతిలో.. సామాజిక సేవ జగ్గారి సుధాకర్ రెడ్డి

## జమ్ములమ్మ ఆలయానికి వేప, రాయి చెట్ల ప్రత్యేకత

## 40 ఏళ్ల కోరికకు రూపం





**చిన్నంబావి,మే 17 (ప్రజా జ్యోతి)**
చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్దమారూర్ గ్రామంలో నూతన జమ్ములమ్మ ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గ్రామంలో సేవా దృక్పథానికి ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రముఖులు జగ్గారి సుధాకర్ రెడ్డి చేపట్టడం విశేషం. తమ దిగంగత తల్లిదండ్రులు కీర్తిశేషులు జగ్గారి వెంకట్ రెడ్డి, జగ్గారి సీతమ్మల జ్ఞాపకార్థం లక్ష్యంగా ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.గ్రామానికి చెందిన దాత జగ్గారి సుధాకర్ రెడ్డి--విజయమ్మ దంపతులు ఇప్పటికే బంగారు మైసమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపట్టి గ్రామ ప్రజల ప్రశంసలు అందుకోగా,ఇప్పుడు అదే ఆలయ సమీపంలో నూతన జమ్ములమ్మ ఆలయ నిర్మాణంతో మరోసారి తమ సేవా భావాన్ని చాటుకుంటున్నారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణం స్లాబ్ దశకు చేరుకోగా, త్వరలోనే పనులు పూర్తికానున్నాయని జగ్గారి సుధాకర్ రెడ్డి తెలిపారు.దాదాపు నాలుగు దశాబ్దాలుగా గ్రామ ప్రజలు పెద్దదగడ గ్రామ శివారులో వెలసిన జమ్ములమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకునేవారు. దూర ప్రయాణం, రాకపోకల ఇబ్బందులు, వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలతో గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడుతూ వచ్చారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఆలయ దర్శనానికి వెళ్లడంలో తీవ్ర కష్టాలు అనుభవించేవారు.ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల కోరికలు, భక్తుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలోనే జమ్ములమ్మ ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. గ్రామస్థుల ఐక్యత, భక్తి భావనకు ప్రతీకగా నిర్మితమవుతున్న ఈ ఆలయం గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురానుంది.ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ దాత జగ్గారి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ..“సామాజిక ప్రయోజనకరమైన పనులు చేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. 40 సంవత్సరాలుగా గ్రామ ప్రజలు పెద్దదగడ చివరలో ఉన్న జమ్ములమ్మ గుడికి వెళ్లి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మన గ్రామంలోనే అమ్మవారి ఆలయం నిర్మిస్తే గ్రామానికి శాంతి, ఐక్యత, ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని భావించాం. అందరం కలిసి ఉత్సవాలు జరుపుకునే అవకాశం కూడా కలుగుతుంది” అని తెలిపారు.అలాగే ఆలయం ముందు ఆచారం ప్రకారం వేప చెట్టు, రాయి చెట్టును నాటడం జరిగింది. అమ్మవారి ఆలయానికి పవిత్రత, శుభసూచకంగా భావించే ఈ చెట్లను నాటడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. జమ్ములమ్మ అమ్మవారి ఆశీస్సులు జగ్గారి విజయమ్మ – సుధాకర్ రెడ్డి కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని గ్రామ భక్తులు ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే నెల 20వ తేదీలోపు గుడి పటిష్ఠ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సుధాకర్ రెడ్డి నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలకు చిరస్మరణీయ కానుకగా నిలవనున్న ఈ ఆలయం భక్తి, సేవ, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన ఉద్యోగులను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించాలి

## మళ్లీ పరీక్ష రాసే విద్యార్థులకునష్టపరిహారం చెల్లించాలి

## బాధ్యులైన ప్రజాప్రతినిధులను బర్తరఫ్ చేయాలి

### మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య




కల్వకుర్తి,మే 16( ప్రజా జ్యోతి)నీట్ పరీక్ష గ్రేస్ పేపర్ ను లీక్ చేసిన ఉద్యోగులను ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని, అందుకు సహకరించిన పలు పార్టీల నేతలను పదవి నుండి తొలగించాలని మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 2021, 2024 సంవత్సరాలలో రెండుసార్లు నీట్ పేపర్ లీకేజీ కావడం జరిగిందని, 2026 లో కూడా ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీటి పరీక్ష నిర్వహించే విధానం నుండి తప్పుకోవాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి అలాగే రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి నీట్ పరీక్ష లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఆయన అన్నారు. దేశంలో 22 లక్షలు, రాష్ట్రంలో 72 వేల పైచిలుకు విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, వారికి ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఉత్తరాది విద్యార్థులకు అనుకూలంగా వ్యవహరించేందుకు నీట్ పేపర్ లీక్ చేశారని, దక్షిణాది విద్యార్థులకు అప్పటి నుండి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ లీకేజీ లతో సమయం , డబ్బు వృధా కావడంతో పాటు మరింత ఆందోళన చెందాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు ఆవేదనకు, ఆందోళనకు గురికాకుండా మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుండా కేంద్ర ప్రభుత్వం , పలు రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని అన్నారు. ఇప్పటికైనా ఈ లీకేజీల నుండి గుణపాఠం నేర్చుకుని భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలను లీకేజీ కాకుండా చూడాలని మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య అన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి సహాయాకులకు అన్నప్రసాద పంపిణీ

**నాగర్ కర్నూల్ : మే 16 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కు చెందిన బూర్గుల నరసింహారావు గత 2014 సం.నుండి నెలలో ఒకరోజు రోగి సహాయకులకు దత్త జయంతి,కార్తీక పౌర్ణమి,అమావాస్య,పౌర్ణమి ప్రత్యేక రోజులలో తప్పనిసరిగా నెలలో ఏదైనా ఒక రోజు 150 మందికి రోగి సహాయకులకు అన్నప్రసాదం,స్వీట్లు,మజ్జిగ,పండ్లు పంపిణీచేస్తున్నారు.అందులో భాగంగా శనివారం వైశాఖ అమావాస్యను పురస్కరించుకొని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో అన్న ప్రసాదం,మజ్జిగ పంపిణీ,పంపిణీ చేశారు.కార్యక్రమంలో మహతి, తులసి శర్మ,ఆదర్శ శర్మ,మల్లికార్జున్,గురునాథ్ గౌడ్,రాము,గురునాథ్,హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ టి.యాదగిరి పాల్గొన్నారు.



# పిడుగుపాటుకు యువకుడు మృతి



**అయిజ మే 16(ప్రజా జ్యోతి):**
అయిజ మున్సిపాలిటీ 6వ,వార్డు పరిధిలోని తుపత్రాల గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది.వ్యవసాయ పొలంలో పనులు చేస్తున్న తండ్రి--కొడుకులపై పిడుగు పడటంతో కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా,తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి.గ్రామానికి చెందిన వడ్డే శ్రీనివాసులు (45),ఆయన కుమారుడు నాగేష్ (25) తమ వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటుండగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది.ఈ క్రమంలో పిడుగు పడటంతో నాగేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.శ్రీనివాసులకు స్వల్ప గాయాలు కాగా,స్థానికులు ఆయనకు చికిత్స అందించారు.

# ప్రతి విద్యార్థి విజయం సమాజ పురోగతికి పునాది

### జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక



**నారాయణపేట ప్రతినిధి మే 16 ప్రజా జ్యోతి**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న “99 రోజుల కార్యాచరణ ప్రణాళిక -- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” లో భాగంగా నారాయణపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “విద్యా విజయోత్సవాలు” కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా విద్యాశాఖ ఈ విద్యాసంవత్సరంలో నిర్వహించిన వివిధ విద్యా, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నెమరువేసుకుంటూ విద్యార్థుల ప్రతిభను గౌరవించింది. పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, క్రీడారంగంలో జిల్లా స్థాయిలో అగ్రగాములుగా నిలిచిన విద్యార్థులు, ఎస్ఎస్సీ పరీక్షల్లో 560 పైగా మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులు, అలాగే 100% ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ప్రశంసా పత్రాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక గారు మాట్లాడుతూ, “విద్య అనేది ప్రతి చిన్నారి భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర శక్తి. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ పురోగతికి బలమైన పునాది. నారాయణపేట జిల్లా విద్యార్థులు విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాలలో కనబరిచిన ప్రతిభ అభినందనీయం. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలి” అని ఆకాంక్షించారు.జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం. గోవిందరాజు గారు మాట్లాడుతూ, “విద్యార్థుల విజయమే ఉపాధ్యాయుని నిజమైన గౌరవం. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోని విద్యార్థులు సాధించిన విజయాలు విద్యాశాఖకు గర్వకారణం. ప్రతిభను గౌరవించడం ద్వారా మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తి కలిగించడం మా లక్ష్యం” అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సదాశివరెడ్డి గారు, వైస్ చైర్మన్ శ్రీమతి మంజుల గారు, ఏఎంఓ విద్యాసాగర్ గారు, రాజేంద్ర కుమార్ గారు, శశికుమార్ గారు, నాగార్జున రెడ్డి గారు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం

# పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

నారాయణపేట ప్రతినిధి మే 16 ప్రజా జ్యోతి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలు చేయుటకు కార్యాచరణ విడుదల చేసిందని, ఇందులో భాగంగా జూన్ 15 వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సంబంధిత సిబ్బందికి, అధికారులకు శిక్షణ, ఎన్యూమరేషన్ ఫారం ప్రింటింగ్ తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, జూన్ 25 వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, ఫారం పూర్తి చేసిన తర్వాత తిరిగి తీసుకోవడం జరుగుతుందని, జూలై 24వ తేదీ లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయడం జరుగుతుందని, జూలై 31వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడం జరుగుతుందని, జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, జూలై 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాల పరిష్కరణ, అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం మొదలయ్యే నాటికి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్ సంబంధిత ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల



సంబంధించిన బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని, బూత్ స్థాయి అధికారులకు వృద్ధ, అనారోగ్య, దివ్యాంగ ఓటర్ల నమోదు విషయంపై ప్రత్యేక శిక్షణ అందించాలని తెలిపారు. ఒకే కుటుంబం సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురస్కరించుకొని జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సిబ్బందికి అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.


ఈ కార్యక్రమంలో ఆర్ . డి.ఓ.రమేష్,తహసీల్దారులు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ విక్రయాలు

**-లక్ష్మి కిరాణం యాజమానిని నిలదీసిన ప్రజలు**

**-దౌర్జన్యానికి పాల్పడిన కిరాణంషాపు యజమాని**




**నాగర్ కర్నూల్ :16 మే (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనిలోని శ్రీలక్ష్మీ కిరాణ షాపులో కాలంచెల్లిన కూల్ డ్రింక్స్ విక్రఇస్తుండడంతో వినియోగదారులు షాప్ యజమానిని నిలదీయడంతో తమకు ఏమి తెలియదని,డీలర్స్ సేల్స్ చేయడంతోనే మేము విక్రయిస్తున్నామన్నారు డీలర్ ప్రకాష్ మాకు కూల్ డ్రింక్స్ సప్లై చేశారని పేర్కొన్నారు.కూల్ డ్రింక్స్

గడువు 03 మార్చి 2026 రోజు ముగిసిందని కిరాణా షాపులో ఉన్న కూల్ డ్రింక్ “లింకా”లో ఒకే తేది ఉండడం గమనార్హం.లింకా ను హౌసింగ్ బోర్డ్ కు చెందిన మొహమ్మద్ యాసర్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లడంతో కుటుంబ సభ్యులు లింకా తాగగా సరైన రుచి లేకపోవడంతో గడువును చూడగా అప్పటి వరకే గడువు ముగియడంతో షాపు దగ్గరికి వెళ్లి షాప్ లో ఉన్న “లింకా” లను చూడగా అన్ని”లింకా” లలో తెదీలు ముగిసి ఉన్నాయి.అంతలోనే కిరాణా షాప్ యజమాని బంధువైన సంతోష్ వచ్చి వినియోగదారులతో వాగ్వాదానికి దిగాడు మేము ఇలాగే విక్రయిస్తాం ఇష్టం ఉంటే కొనండి లేదంటే వెళ్లిపోండి అంటూ దౌర్జన్యంగా మాట్లాడడంతో వినియోగదారులకు కిరణ్ షాపు యజమాని కర్ణాకర్ బంధు సంతోష్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.అంతలోనే అటుగా వెళ్లే ప్రజలంతా గుమికూడగా మేము ఇలాగే అమ్ముకుంటాం ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకొండి అంటూ సంతోష్ ఖరాఖండంగా చెప్పారు.విలేకరులకు చెప్తావా చెప్పుకో పో ఎవరేం చేస్తారో చూసుకుంటాం అంటూ తీవ్ర వాగ్యవాదానికి దిగారు.ఈ సంఘటనపై కూల్ డ్రింక్స్ డీలర్ ప్రకాష్ తో వివరణ కోరగా తాము విక్రయించినప్పుడు కాల పరిమితి ఉందని మాకు

ఎలాంటి సంబంధం లేదని షాప్ యజమానులకు సంబంధమని జవాబు ఇచ్చారు.

27,027

## అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**నాగర్ కర్నూల్ : మే 16(ప్రజా జ్యోతి)**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 2026-27 విద్య సంవత్సరానికి సంబంధించి 1వ,తరగతి నుంచి ఇంటర్ ప్రవేశాలు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు 6నుండి 14 ఏళ్ల వయసు ఉండి 40 శాతం అందత్వం కలిగిన ధృవపత్రం ఉన్న బాలబాలికలకు ఉచిత భోజన సదుపాయంతో పాటు నాలుగు జతల దుస్తులు ఇవ్వనున్నట్లు రాములు తెలిపారు.మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి కూడలిలో ఉన్న అందుల విద్యాలయంలో దరఖాస్తులను చేసుకోవచ్చని ఇతర వివరాలకు 96182 43794 నెంబర్లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ రాములు తెలిపారు.

## సరిత తిరుపతయ్యను మర్యాదపూర్వకలంగా కలిసిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి





**నాగర్ కర్నూల్ : మే 16 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గా నూతన బాధ్యతలు చేపట్టిన సరిత తిరుపతయ్యను శనివారం నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలుతెలియజేశారు.

## అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

### స్థానిక ఎస్సై కురుమూర్తి



కల్వకుర్తి, మే 16 (ప్రజా జ్యోతి):

కల్వకుర్తి మండల పరిధిలోని లింగసాని పల్లి ఎల్లికట్ట గ్రామాల నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకొని డ్రైవర్ల యజమానిలపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై కురుమూర్తి తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.